కట్టి విడిచిన పట్టుచీర

వసుంధర

సాయంత్రం అరయింది.

శీతాకాలం కావడంవల్ల అప్పుడే బీచిదగ్గర చీకటిగా వుంది.

పున్నమి వెన్నెల సముద్రంలో అందంగా ప్రతిఫలిస్తోంది.

"ఈరోజి కిక్కడే వుండిపోదాం—" అన్నాడు శాస్త్రి.

"మరి భోజనం?" అన్నాడు శర్మ.

"నాకు పిడతకింద పప్పుతోటే కడుపు నిండిపోయింది" అన్నాడు శాస్త్రి. అతడి చేతిలో యింకా ఆ పొట్లముంది.

"ఇప్పుడలాగే అనిపిస్తుంది. ఓ గంట పోయాక ఆకలేస్తుంది—"

"ఆకలేస్తుందని బెంగెందుకు? ఇప్పుడు మన దగ్గర డబ్బులేదు కనుకనా?" అన్నాడు శాస్త్రి.

"మనం వర్తమానం చూసి తృప్తి చెందడంవల్లనే భవిష్యత్తులో ఏడుస్తున్నాం—" అన్నాడు శర్మ.

"మనిషి జీవించేది భవిష్యత్తులో కాదు. వర్తమానంలో!"

"ఈ క్షణంలో వర్తమానం భవిష్యత్తులో గతం. మనిషి బ్రతికేది వర్తమానంకోసం కాదు. భవిష్యత్తుకోసం...."

"ఇంతకీ భవిష్యత్తులో నీకేం కావాలో చెప్పు!"

"ఈ పున్నమి వెన్నెలలో బీచివద్ద నీవు నేనూ, నావు నువ్వూ జంటగా ఉండడంవల్ల ఈ వర్తమానం గతంగా మారితేనే మంచిదనిపిస్తోంది. ఆ గతాన్ని భవిష్యత్తులోకూడా తల్చుకోకూడదనిపిస్తోంది—" అన్నాడు శర్మ.

"ఈరోజు నీకేదో అయింది—" అన్నాడు శాస్త్రి.

"శాస్త్రీ! మనంకూడా ఇలా ఎన్నాళ్ళు అగమ్మకాకుల్లా తిరుగుతాం. పెళ్ళిచేసుకుందాం. బ్రతుకు బాట ఏర్పాటు చేసుకుందాం—" అన్నాడు శర్మ.

"నువ్వు పెళ్ళి చేసుకుంటానంటే వద్దన్నానా?" అన్నాడు శాస్త్రి.

"సుఖమైనా కష్టమైనా మనం జంటగా అనుభవించాలి—"

"అలాగనకు. అది భారత యుద్ధకాలంలోనే విచిత్రంగా చెప్పబడింది. అంత పెద్ద మహాభారతంలో ఒక్క ద్రౌపదికి తప్ప ఏ స్త్రీకీ ఒకరుమించి భర్తలు లేరు—" అన్నాడు శాస్త్రి.

"ఛా—నా ఉద్దేశ్యమది కాదు. నువ్వూ నేనుకూడా వేర్వేరు అమ్మాయిల్ని పెళ్ళిచేసుకుందాం—"

"పెళ్ళికిముందు జీవితంలో స్థిరపడాలి కదా!" అన్నాడు శాస్త్రి.

"పెళ్ళయితేగానీ మనం స్థిరపడలేం! భార్యలు మన తత్వాన్ని మార్చుతారు—" అన్నాడు శర్మ.

"అయితే సరే—నువ్వో పిల్లను చేసుకో. నాకో పిల్లను చూసి పెట్టు—"

"మూడ్రం అయింది—"

"ఎవరు?"

"మన వీధిలోనే వుంటున్నారు సోమయాజులుగారు. ఆయనకిప్పుడు రెండో పెళ్ళాం. ఆమె వయసు పాతిక్కి లోపే!"

"అయితే మాత్రం — పెళ్ళయిన వాళ్ళను చేసుకుంటామా? నలుగురూ మన ముఖంమీద ఉమ్మేస్తారు.."

"విధవ జోకులు వేయకు. నేను నీకు చెప్పేది సోమయాజులుగారి పెద్ద భార్య కూతుళ్ళ గురించి ..."

"ఎవరు వాళ్ళు?"

"అమల—విమల—"

"పేర్లు బాగున్నాయి. కానీ ....?"

"ఊఁ, నీ సందేహమేమిటో చెప్పు..."

"మనుషులు బాగుంటారా?"

"ఆడపిల్లలకు వయసు వంద వంకర్లు తీసుకుందంటారు. వీళ్ళ శరీరాలకు వంకరలే అందాన్నిచ్చాయి—"

"అంటే—పోలియో వచ్చిందా?"

శర్మ చిరాగ్గా-"అసలు ముందు పెళ్ళి నీకే అర్జంటు. నీ విధవ జోకులు పెళ్ళాంతప్ప వేరెవ్వరూ భరించలేరు" అన్నాడు.

"మరి వంకర అంటే ఏమిటి?"

"బాపూ బొమ్మ చూశావుగదా—ఆడపిల్ల బొమ్మకు వంకరలే అందం. ఏ వంకర్లూ లేనిపిల్ల సిలిండర్లా ఉంటుంది—...."

"ఓహో—నాకది తట్టనేలేదు....అయినా నువ్వింత కవితాధోరణిలో మాట్లాడతావని నాకేం తెలుసు? బొత్తిగా సెన్సాఫ్ హ్యూమర్ లేని నువ్వీరోజున ఇలా మాట్లాడుతున్నావంటే నిజంగా నే యిది పెద్ద విశేషం... అది సరేగానీ వాళ్ళను నేనెప్పుడూ చూడలేదు. నువ్వెలా చూశావూ?" అన్నాడు శాస్త్రి.

"నువ్వా చూసివుండేవాడివి నీలో సౌందర్య దృష్టి ఉంటే?"

శాస్త్రి సాలోచనగా—"అందమైన ఆడపిల్ల కనబడితే అప్రయత్నంగా నా దృష్టి అటే మళ్ళుతుంది. వాళ్ళు నిజంగా అందమైన వాళ్ళేనా?" అన్నాడు.

"నువ్వు ముందు అందాన్ని చూడవు. మెరిసే చీరనో, గుబాళించే సెంటు పరిమళాన్నో గమనించి ఆ తర్వాత మనిషిని చూస్తావు. సవతితల్లి ఆధ్వర్యంలో పెరుగుతున్న యీ పిల్లలు మంచి బట్ట కట్టుకోరు. చూడ్డానికి పని మనుషుల్లా కనిపిస్తారు. ఇంటి పనీ, బయట పనీ వాళ్ళే చేయాలి. ఓసారిద్దరూ కలిసి ఇరవై కేజీల బరువు సంచీలు పట్టుకుని వస్తూంటే నేను సాయం చేశాను...."

"ఇంతకీ నీకు వాళ్ళెలా పరిచయమయ్యారు?"

"ఆలోచించి చూడు...."

శాస్త్రి వెంటనే—"ఓహో—నువ్వు వాళ్ళింట్లో ప్రయివేటు చెబుతున్నావు కదూ!" అన్నాడు.

"అవును-రోజూ సాయంత్రం ఆరునుంచి ఏడుదాకా సోమయాజులుగారి బావమరిదికి ప్రయివేటు. కనాది

వారాలు సెలవు. ఈరోజు శనివారం...."

"ఆ యింట్లో నాకు ప్రత్యేకమైన ఆకర్షణేదీ కనపడక ప్రయివేటుకొప్పుకోలేను. నువ్వొప్పుకున్నావు...."

"ఆకర్షణ నీకేం కనబడుతుంది? సోమయాజులుగారి భార్య వయసు పాతిక్కిలోపే అయినా మనిషి యాభై ఏళ్ళదానిలా ప్రవర్తిస్తుంది. గోచీపోసి ఏడుగజాలచీర కడుతుంది. రూపాయకాసంత బొట్టు పెడుతుంది. ఇరవై నాలుగ్గంటలూ పూజలూ, స్నానాలూ! నిన్నూ నన్నూ బాబూ అని పలకరిస్తుంది. మనదేశపు ఆడవాళ్ళు పెళ్ళి కాగానే ముసలివాళ్ళయిపోతారు. విదేశాల్లో ఆడవాళ్ళు ముసలితనంలోకూడా పెళ్ళిళ్లు చేసుకుంటూరు. ఏమైతేనేం ఆ యింట్లో నీకాకర్షణలేదు...."

"నీకుంది కాబట్టి చేరావు. ఇంతకీ ఆ పిల్లలతో పరిచయమెలాగయింది నీకు? సరుకులు మోసినప్పుడేనా?"

"కాదు. ఆ పిల్లలిద్దరూ ప్రయివేటుగా ఇంటర్మీడియెట్ కు కడుతున్నారు. సోమయాజులుగారి బావమరిదికి పాఠం చెబుతూంటే యేవో సందేహాలు తీర్చుకుందుకు నా దగ్గరకు వస్తూండేవారు...."

"అంటే వాళ్ళు నిన్ను వలలో వేసుకున్నారన్న మాట...."

"వాళ్ళకు మగాళ్ళతో మాట్లాడ్డానికే మొహమాటం. చాలా మంచిపిల్లలు. అసలు సంగతి తెలిస్తే నువ్వు తెల్లబోతావు.... వాళ్ళ సవతితల్లి మనగురించి ఆరా తీసింది. అన్నీ తెలుసుకున్నాకనే నన్ను తన తమ్ముడికి ప్రయివేటు మాస్టర్ని చేసింది. ఆ కుర్రాడు చాలా తెలివైనవాడు. నిజానికి వాడికి ప్రయివేటు అవసరంలేదు."

"అంటే?"

"ఇంకా అర్థం కాలేదా? నేనా పిల్లల్లో ఒకర్ని ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని ఆ తల్లి ఆశ...."

"ఆ ఆశను నువ్వు నిజం చేస్తున్నావు...."

"నువ్వూ చేస్తావు...." అన్నాడు శర్మ.

"నీకెలా తెలుసు?"

"శేషు ప్రయివేటు చెప్పడానికి నువ్వూ రా!"

"నేను రాను..."

"వచ్చితీరాలి...."

"ఏమిటీ జబర్దస్తీ....?"

"నీ కంటే నీకు తెలియనప్పుడు ఇద్దరిలో కాస్త పెద్ద వాణ్ణిగా నేను కాస్త జబర్దస్తీ చేయక తప్పదు...."

"అరే—హఠాత్తుగా నువ్వు పెద్దవాడివై పోయావే-కారణమేమిటి?"

"ఆ అమ్మాయిలిద్దరిలో అమల పెద్దది. అమలను నేను ప్రేమిస్తున్నాను...." అన్నాడు శర్మ మొహమాట పడుతూ.

"అంటే విమలను నేను ప్రేమించాలన్న మాట.... ఒకవిధంగా నిన్ను మెచ్చుకోవాలి. ఇద్దరిలో చిన్నపిల్లనే వదిలినందుకు...."

"పేరుకే వాళ్ళు చిన్నా పెద్దా.... వాళ్ళిద్దరూ కవలలు...."

శాస్త్రి తెల్లబోయి—"అయితే నేనీ ప్రేమకు ఒప్పుకోను. ఇందులో నీ స్వార్థమేదో ఉంది. నువ్వు వాళ్ళిద్దర్నీ వలలో వేసుకొని—ఒకర్ని పెళ్ళిచేసుకొని ఇంకొకర్ని నాకు అంటగట్టాలనుకుంటున్నావు—" అన్నాడు.

"ఏడిసినట్లుంది—ఇన్నేళ్ళ మన స్నేహాన్ని దానికర్థం

చేసుకున్నది!"

"మన స్నేహాన్ని నేనన్ని విషయాల్లోనూ నమ్ముతాను. ఆడవాళ్ళ విషయంలో మాత్రంకాదు. వాళ్ళిద్దరూ ఒక్కలాగే ఉంటే ఎవరెవరో తెలియక నే నిబ్బంది పడాలి. తొలినుంచీ పరిచయమున్న నీకు నన్ను మోసం చేసే అవకాశముంది."

శర్మనవ్వి—"అదా నీ అనుమానం! అక్కచెల్లెళ్ళిద్దరూ అందంలో ఒకరికొకరు తీసిపోరు. కానీ పోలికల్లో ఎవరికి వారే! ఒకే తల్లిబిడ్డలని చెబితే నమ్మడం కష్టం...." అన్నాడు.

"అయితే సరే—రేపు నేనూ వస్తాను ప్రయివేటుకి. అప్పుడేం జరుగుతుంది?"

"గదిలో సోమయాజులుగారి బావమరది ఉంటాడు. అమల, విమల ప్రవేశించగానే నువ్వు విమలతో మాట్లాడు. నేను అమలతో మాట్లాడుతాను. సోమయాజులుగారి బావమరిది గదిమధ్యలో తన పాఠాలు తను చదువు కుంటాడు. ఆడపిల్లలు తమ కష్టం సుఖం నీతోటీ నాతోటీ చెప్పుకుంటారు...."

"వాళ్ళకు మగాళ్ళతో మాట్లాడడమంటే భయ మన్నావు...."

"భయమే — కానీ సవతితల్లి పోరుతూంటే ఏం చేస్తారు? వాళ్ళ పెళ్ళి కుదర్చడానికామె యీ మార్గం తప్ప ఇంకేవీ ఆలోచించదు...."

"సరే — నీమాటమీద వస్తున్నాను. కానీ నీకు ముందుగా మాటివ్వలేను—" అన్నాడు శాస్త్రి గంభీరంగా.

“నాకు తెలుసు-వచ్చే పున్నమికి మనమిక్కడే జంటలుగా విడివిడిగా కూర్చుంటామని!” అన్నాడు శర్మ.

2

సోమయాజులుగారి బావమరిది ప్రభాకరం పెన్నారు బోర్డు మెంబర్లా గదిమధ్యలో బరకంమీద కూర్చుని లెక్కలు చేసుకుంటున్నాడు.

అతడికి కుడిపక్క కాస్త దూరంగా శాస్త్రి, విమల..

విమల అందంగా, అమాయకంగా వుంది. ఆమె శరీర ఛాయ మెరుగుపెట్టని బంగారంలా వుంది.

ఆమె మాట్లాడుతూంటే పెద్ద పెద్ద కళ్ళు చక్రాల్లా తిరుగుతున్నాయి.

శాస్త్రి చాలాసేపు ఆమెనే చూస్తూ మాటలు వినడంలేదు.

విమల తన కష్టాలు చెప్పుకుంటోంది.

ఆమె అంట్లు తోమాలి. ఇల్లూడ్చాలి. బట్టలుతకాలి. కూరలు, సరుకులు తేవాలి!

ఆమె మంచి బట్టలు కట్టుకోకూడదు. పౌడరు రాసుకో కూడదు. ప్రత్యేకంగా అలంకరించుకోకూడదు.

ఇవన్నీ ఆ యింట్లో శిలాశాసనాలు.

శాస్త్రికామె మాటలు లీలగా వినబడుతున్నాయి. భావం మనసుకంటడంలేదు. చూపులామెను గమనిస్తున్నాయి. తనువు పరవశిస్తోంది.

“మీరు నా మాటలు వినడంలేదు....” అంది విమల.

శాస్త్రి ఉలిక్కిపడి “వింటున్నాను—” అన్నాడు.

“అయితే నా కష్టాలు మిమ్మల్ని కదిలించలేదు..”

“కదిలించాయి....”

“కదిలిస్తే కంట తడిపెట్టరేం? కనీసం ఓ సానుభూతి

మా కైనా చెప్పరేం?" అంది విమల.

"ఏడ్చే మగాణ్ని నవ్వే ఆడదాన్ని నమ్మకూడదంటారు...." అన్నాడు శాస్త్రి.

"కష్టసుఖాలు మనిషిని కదిలిస్తే సామెతలు గుర్తుండవుట. మా నాన్న అమ్మను తల్చుకుని ఏడ్చినపుడల్లా ఈ మాటే అంటాడు...." అంది విమల.

"పురుషోత్తముడు దేనికీ చలించడు.... నేను సామాన్యుణ్ని కాదు...." అన్నాడు శాస్త్రి వెంటనే.

"పోనీ సానుభూతిగా ఓ మాట చెప్పవచ్చుగా...." అంది విమల.

"అవును .... పాపం నీ కష్టాలన్నీ పెళ్ళితోటే తీరాలి..."

"నా పెళ్ళి అంత సులభంకాదు. నాన్న కట్నమివ్వలేడు...."

"ఇవ్వలేనంటే ఎలా కుదుర్తుంది? ఎంతో కొంతైనా ఇచ్చుకోక తప్పదుకదా!"

విమల నిట్టూర్చి-"ఎదురుకట్నమిచ్చే విధవకే నన్నిచ్చి పెళ్ళి చేస్తానంటుంది పిన్ని —" అంది.

"ఎదురుకట్నం తీసుకుంటూ విధవకూడా అనడమెందుకు?" అన్నాడు శాస్త్రి కాస్త ఇబ్బందిగా.

"ఎందుకంటే —ఎదురుకట్నం విధవలే ఇస్తారుట!"

"నీవంటి ఆడపిల్లల కిలాంటి అభిప్రాయమేర్పడడం స్త్రీ జాతికే దురదృష్టం— విధవలని తెలిసీ— వాళ్ళనే పెళ్ళి చేసుకోడమెందుకు?'

"మా పిన్ని నన్ను విధవకే కట్టబెడతానంటోంది.."

"అంటే...."

"నన్ను పెళ్ళిచేసుకునేవాడు తనో విధవనని ఋజువు

చేసుకోవాలి...."

"కాబోయే భార్య తన్ను బెధకోవనువాలని ఏ వెధవా అనుకోడు...."

విమల అందంగా నవ్వి .... "ఎదురు కట్నమిచ్చిన వాడిని వెధవ అని యే భార్యా అనుకోదు. నేనిందాకా చెప్పింది మా పిన్ని అభిప్రాయం...." అంది.

ఆమె నవ్వుకు శాస్త్రి పులకరించిపోతూ—"మరి నీ అభిప్రాయమేమిటి?" అన్నాడు.

"కాబోయే భర్త నన్ను పెళ్ళికిముందే ప్రేమించాలి. నా ప్రేమను పొందడం కోసం ఓ గొప్ప కానుక ఇవ్వాలి. అప్పుడు నేనతడి ప్రేమ నంగీకరిస్తాను...."

"గొప్ప కానుక అంటే ఏమిటి?"

"పట్టుచీర...."

శాస్త్రి నవ్వి — "చాలా సింపుల్ కోరిక నీది!" అన్నాడు.

"నా కోరిక సింపుల్ కాదు...."

"నీకు సింపుల్ కాకపోవచ్చు. నా కది చాలా సింపుల్...."

"నిజంగా?" అంది విమల ఆశ్చర్యంగా "ఆ పట్టుచీర ఎక్కడుందో కూడా మీకు తెలుసా?"

"ఈ ఊరి మొత్తానికి పట్టుచీరలు మంచి వెక్కడ దొరుకుతాయో నాకు తెలుసు. దుకాణం పేరు చెప్పను. తెచ్చి చూపిస్తాను" అన్నాడు శాస్త్రి.

"నాక్కావలసిన పట్టుచీర దుకాణంలో లేదు...."

"మరెక్కడుంది?"

"వెంకటేశ్వర్రావుగారింట్లో!"

"అక్కడెందుకుంది?"

"ఆ పట్టుచీర మా అమ్మది. ఒకసారి దేబ్బవసరమై నాన్న దాన్ని వెంకటేశ్వర్రావుగారికి తాకట్టు పెట్టాడు. ఆయన వడ్డీ వ్యాపారి. అమ్మ కా పట్టుచీరంటే ప్రాణం. నాకూ అదంటే ఎంతో యిష్టం. ఆ చీర ఎప్పుడూ కొత్తగా కనబడుతుంది. అప్పుడే దుకాణంలోంచి తెచ్చామా అనిపిస్తుంది. అమ్మ ఆ చీర నా పెళ్ళి కిచ్చేస్తానని చెప్పింది. కానీ" విమల ఒక్కక్షణం ఆగి కళ్ళు తుడుచుకుంది "చీర విడిపించి తెచ్చేలోగానే అమ్మ చచ్చిపోయింది. తర్వాత పిన్ని వచ్చింది. పట్టుచీర గురించి ఎన్నోసార్లు నాన్నకు చెప్పాను. నాన్నకు పిన్నిని నొప్పించాలంటే భయం. ఆ పట్టుచీరను విడిపించడం పిన్ని కిష్టంలేదు. అదీకాక వడ్డీ బాగా ఎక్కువయింది.... ఆ ధర పెడితే రెండు పట్టుచీరలు వస్తాయిట...."

"అయితే పట్టుచీర వెంకటేశ్వర్రావు గారింట్లో వుందన్న మాట. నా కాయన ఇంటి అడ్రసు కావాలి."

"ఎందుకు?"

"నేనా పట్టుచీర తెస్తాను!"

"మీరు నన్ను ప్రేమిస్తున్నారా?" అంది విమల చటుక్కున.

"అలా ఎందుకనుకుంటున్నావు!" అన్నాడు శాస్త్రి ఆశ్చర్యంగా.

"మీరు పట్టుచీర తెస్తానన్నారుగా!"

శాస్త్రి తడబడి "నిజమే! అది నీకు ప్రేమ కానుక అవుతుంది. నేనే గనుక ఆ చీరను ప్రేమకానుకగా ఇస్తే నువ్వు నన్ను ప్రేమిస్తావా?" అన్నాడు.

విమల చటుక్కున "మిమ్మల్ని ప్రేమించడానికి పట్టుచీర తేనక్కర్లేదు. నన్ను ప్రేమించను కూడా అక్క

లేను. ప్రేమిస్తున్నానని ఒక్కమాట అన్నారు కదా అది చాలు" అంది.

అప్రయత్నంగా శాస్త్రి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అతడా విను ప్రేమిస్తున్నానని అన్నాడో లేదో అతడికే గుర్తులేదు. కానీ కళ్ళు తుడుచుకుంటూ "విమలా! నువ్వు నన్ను ప్రేమించినప్పటికీ—నీకు ప్రేమ కానుక యిచ్చినాక నే నీ ప్రేమకు అరుణానిపించుకుంటాను. నీ కోరిక యింత సింపుల్ గా వున్నప్పుడు — నే నామాత్రం చేయాలి" అన్నాడతడు.

ఆమె కోరిక అంత సింపుల్ కాదని అప్పు డతడికి తెలియదు.

అదే సమయంలో ప్రభాకరానికి ఎడమ పక్కగా కాస్త దూరంలో అమల కూడా శర్మను పట్టుచీర కాక పోయినా అలాంటిదే యింకో కోరిక కోరింది.

శర్మ కూడా అది సింపులేనని పొరబడి మాట ఇచ్చాడు.

3

గదిలో ఎదురెదురు కుర్చీల్లో కూర్చున్నారు శాస్త్రి, శర్మ.

"అమలకు పెద్దకోరిక లేమీ లేవు. ఎనిమిదేళ్ళ క్రితం సోమయాజులుగారు తనకున్న రెండిళ్ళలో ఒకటమ్మే శాడు. అది చెంగల్రావు పేటలో వుంది. పెళ్ళైతే ఆ యింట్లో కాపురం పెట్టాలనుంది అమలకు. ఆ యిల్లంటే వాళ్ళమ్మకెంతో యిష్టంట...."

"అమల కంటే విమలే నయం. పట్టుచీరతో సరిపెట్టుకుంది...."

"ఇల్లు నేను కొనక్కర్లేదు. అద్దెకు సంపాదిస్తే

చాలు....”

“ఇంటి గురించి వాకబు చేశావా?”

“ఇప్పుడే ప్రారంభించాలి.”.

“మరి ఇన్నాళ్ళనుంచీ ఏం చేస్తున్నావు?”

“ఇంతవరకూ నేను అమలతో పెళ్ళి కబురు మాట్లాడ లేదు. మన్నిద్దరి పెళ్ళిళ్ళూ ఒక్కసారే జరగాలి. అమల, విమల మనకు సరైన జోడీ అనిపించింది....”

“గతంలో కూడా ఒకసారి గుర్తుందా?” అన్నాడు శాస్త్రి.

“అది వేరు. వాళ్ళు మనపై ప్రయోగించబడ్డారు.... వీళ్ళు అసలు సిసలు సంసారపక్షం అమ్మాయిలు.”

“వాళ్ళ సంగతి సరే....మనం సంసారపక్షమేనా అని!”

“పెళ్ళి చేసుకునే ముందు ప్రేమకానుకలిస్తే మనమూ సంసారపక్షమే అవుతాం” అన్నాడు శర్మ.

“అలాంటి వాళ్ళను వెధవలంటుంది సోమయాజులు భార్య.”

“అంటే అనుకోనీ మనకేమి నష్టం?”

“నిజంగా మనం వెధవలమే ననిపిస్తోంది. లేకుంటే ఇంతవరకూ మనకు పిల్లనిస్తామంటూ ఎవరైనా వచ్చారా?”

“బాధపడకు—నవ్విన ఊళ్ళే పట్నాలవుతాయి....” అన్నాడు శర్మ.

“కానీ మనం పట్నంలోనే వున్నాం.”

“శాస్త్రీ! నిరాశ మనకు తగదు.”

“పెళ్ళి గురించి తల్చుకోగానే నిరాశ మొదలయింది. పెళ్ళైతే యింకెలా మారిపోతామో—మనకు పెళ్ళిళ్ళు

వద్దు."

"పుట్టిన ప్రతి మనిషికీ చావెలా తప్పదో పెళ్ళి కూడా అలాగే తప్పదు."

"చావును తప్పించుకోలేం. పెళ్ళిని తప్పించుకో గలం."

"పెళ్ళినీ తప్పించుకోలేం. ఆమెను తల్చుకుంటే ఆమె లేకుండా యింతకాలం యెలా బ్రతికామా అనిపిస్తోంది....."

అప్రయత్నంగా శాస్త్రికి విమల గుర్తొచ్చింది. అతడు లేచి నిలబడి — "పద — ముత్యాలవానిపాలెం వెడదాం" అన్నాడు.

"అక్కడి కెందుకూ?"

"వెంకటేశ్వర్రావు విల్లక్కడే వుంది."

"ముత్యాలవాని పాలెంలో వడ్డీ వ్యాపారులా! ఆశ్చర్యంగా వుందే!"

"తర్వాత తీరిగ్గా ఆశ్చర్యపడవచ్చు. ముందు లే...."

"అయితే ముందు చెంగల్రావు పేట వెళ్ళి యింటి సంగతి వాకబు చేద్దాం. ముత్యాలవాని పాలెం బాగా దూరం కదా. రేపు వెళ్ళవచ్చు."

"మనిషి గ్రహాంతరయానాలు చేస్తున్న ఈ రోజుల్లో ముత్యాలవాని పాలెం దూరమంటావా? అవమానం కదూ!"

"వాళ్ళకు రాకెట్లున్నాయి. మనకు సైకిలు కూడా లేదు."

"సైకిలంటే గుర్తొచ్చింది. రాజారావు విప్పాదూళ్ళోలేడు. అతడు గ్యారేజీ తాళం మనకిచ్చి అప్పుడప్పుడు మోటారు సైకిలు తో కిక్కివ్వమన్నాడు

గుర్తుందా!" అన్నాడు శాస్త్రి.

శర్మ చటుక్కున లేచి నిలబడి "నీ బుర్ర అమోఘం. పద....మన మిప్పుడు ముత్యాలవాని పాలెమూ వెళ్ళవచ్చు, చెంగల్రావు పేటా వెళ్ళవచ్చు. కానీ ముందు చెంగల్రావు పేటే వెడదాం. అక్కడ పని చూసుకుని ముత్యాలవాని పాలెం వెడదాం. ఎందుకంటే వడ్డీవ్యాపారు లెప్పుడూ తిన్నగా నిద్రపోరు. ఎప్పుడు వెళ్ళినా లేస్తారు. ఇళ్ళద్దె కిచ్చేవాళ్ళలా కాదు" అన్నాడు.

ఏ కళనున్నాడో శాస్త్రి అంగీకరించాడు.

4

మోటారు సైకిలా యింటి ముందు ఆగింది.

ఇంటి చుట్టూ గోడ. గోడలో ఓ చిన్న తలుపు. తలుపుకు గడియ లేదు. తోయగానే తెరుచుకుంది.

లోపల చాలా ఆవరణ వుంది.

ఎందుకైనా మంచిదని శాస్త్రి, శర్మ మోటారు సైకిలు గుమ్మంలోంచీ లోపలకు తోసుకు వెళ్ళారు.

శాస్త్రి తలుపు దగ్గరగా వేసి గొళ్ళెం కూడా పెట్టాడు.

ఇంట్లో ఎక్కడా అలికిడి లేదు.

శర్మ టైము చూసుకుని "ఇంకా ఎనిమిదే అయింది" అన్నాడు.

"ఇళ్ళున్న వాళ్ళంతే. హాయిగా నిద్రపోతారు—ఏ సమయంలోనైనా" అంటూ శాస్త్రి ముందడుగు వేశాడు.

అది డాబా యిల్లు. వాటా పెద్దదే. ఆధునికంగా వుంది. ముందుగా మూడు మెట్లెక్కితే నడవలా వుంది.

నడవ కెదురుగా రెండు గుమ్మాలు. అటూ ఇటూ రెండు గుమ్మాలు. అందులో మూడు గుమ్మాలకు తాళా లున్నాయి. ఓ గుమ్మానికి తాళం లేదు.

శాస్త్రి తాళంలేని గుమ్మం దగ్గరకు వెళ్ళి తలుపు తట్టాడు.

“ఎవరూ?” అంటూ లోపల్నుంచి సన్నని గొంతు కొకటి వినబడింది.

“ఇ ట్లో మగాళ్ళున్నట్లు లేదు” అన్నాడు శర్మ.

“ఆడాళ్ళ కళ ఎక్కువ. అద్దె బాగా ఎక్కువడుగు తుందో ఏమో” అన్నాడు శాస్త్రి బెరుకుగా.

“పెళ్ళి చేసుకోబోతున్నాం. మాటిమాటికీ ఆడాళ్ళను తప్పు పట్టకు” అన్నాడు శర్మ అతణ్ని హెచ్చరిస్తూ.

తలుపులు తెరుచుకున్నాయి.

నడి వయసు స్త్రీ. వయసు నలభై పైన ఉండవచ్చు. జుట్టు అక్కడక్కడ నెరిసింది. నుదుట రూపాయి కాసంత బొట్టు.

“ఎవరు బాబూ మీరు!” అందామె.

“నా పేరు శాస్త్రి. ఇతడు శర్మ!” అన్నాడు శాస్త్రి.

“బ్రాహ్మలేనన్న మాట....ఏ పనిమీద వచ్చారు?”

“పెళ్ళి చేసుకోబోతున్నాం—యిల్లు చూసుకుందుకు వచ్చాం.”

“మాయదారి కలికాలం. మగాళ్ళకూ మగాళ్ళకు పెళ్ళేమిటయ్యా” అందా స్త్రీ నవ్వుతూ.

శర్మ తెల్లబోయాడు. శాస్త్రి తమాయించుకుని “పెళ్ళి మా యిద్దరికే గానీ మా యిద్దరికీ కాదు” అన్నాడు.

"నువ్వేం మాట్లాడుతున్నావో నా కర్థం కాలేదు" అందా స్త్రీ.

"మేమిద్దరం చెరో అమ్మాయినీ త్యాగలో పెళ్ళి చేసుకోబోతున్నాం. అందుకని ఇంటికోసం వెతుక్కుంటున్నాం." అన్నాడు శాస్త్రి.

"లోపలకు రండి" అందామె.

ఇద్దరూ వెళ్ళారు.

"జోళ్ళు విప్పుకోండి" అందామె.

"ఎందుకు?" అన్నాడు శాస్త్రి.

"విప్పుకోండి" అందామె గద్దిస్తున్నట్లు.

ఇద్దరూ జోళ్లు విడిచారు.

"లోపలకు రండి" అందామె మళ్ళీ.

వాళ్ళు జోళ్ళు విడిచిన చిన్న గదిలోంచి శాస్త పటాల మైన గదిలో అడుగుపెట్టారు. అక్కడ నేల మీద కంబళి పరచివుంది. ఒక పక్కగా వ్యాసపీఠ ముంది. అందులో ఏదో పుస్తకముంది.

ఆ స్త్రీ వ్యాసపీఠం వెనుక తను కూర్చుంది. శాస్త్రినీ, శర్మనూ తన కెదురుగా కూర్చోమంది.

ఇద్దరూ కూర్చున్నారు.

"ఈ తనువు మిథ్య. ఈ ప్రపంచం మిథ్య. మనిషి మాయామోహాల నుంచి బయటపడాలి" అందామె.

"అవును" అన్నాడు శర్మ వినయంగా.

ఆమె ఉదాహరణలు ప్రారంభించింది. శాస్త్రికి విసుగ్గా వుంది. శర్మకోసం భరిస్తున్నాడు.

అలా చాలాసేపు గడిచింది.

శాస్త్రి టైము చూసుకుని "మరోసారి వస్తాం—ఈ రోజు మాకు పనివుంది. ఇప్పుడర్జంటుగా ముద్వాలవాని

పొలెం వెళ్ళాలి" అన్నాడు.

ఆ స్త్రీ అదోలా అతడి వంక చూసి "మీ యిష్టం. వెళ్ళాలనుకుంటే వెళ్ళిపొండి" అంది.

"ఇంటి సంగతి చెప్పలేదు" అన్నాడు శర్మ.

"నా వేదాంతం వంటబట్టని వాళ్ళకు నేను—ఇల్లిలా యిస్తాను" అందా స్త్రీ.

శర్మ వినయంగా "మీ వేదాంతం నా కంతో నచ్చింది" అన్నాడు.

"అయితే మరి కాసేపు వినొచ్చుగా" అందా స్త్రీ.

"మీరు చెప్పింది జీర్ణించుకున్నాను. మరీ ఎక్కువైతే జీర్ణించుకోవడం కష్టం కదా — జీర్ణించుకోనప్పుడు వినడం బాగుండదు".

"అయితే విన్నదందా జీర్ణించుకున్నానంటావు...."

"ఊఁ" అన్నాడు శర్మ.

"అబద్ధం...."

"మీ వంటి పుణ్యాత్ములకు నేనబద్ధం చెప్పను...."

"నిజంగా అబద్ధం చెప్పకపోతే నా వేదాంతం వంటబట్టిన వాడికింకా యిల్లెందుకు? యిల్లాలెందుకు?" అందా స్త్రీ.

"నిజమే" అన్నాడు శర్మ.

"అయితే యింటి గురించి అడక్కు — వెళ్ళు" అందా స్త్రీ.

ఇద్దరు మిత్రులూ వెర్రిముఖాలతో అక్కణ్ణించి లేచారు.

"అలా మాట్లాడకుండా వెళ్ళిపోవడమేనా? పెద్ద దాన్ని. నా దగ్గర సెలవు తీసుకోవద్దూ."

"వస్తామండి" అన్నాడు శర్మ.

"మళ్ళీ వస్తానంటే నా కభ్యంతరం లేదు. వచ్చి నప్పుడు నా వేదాంతం రెండు గంటలైనా వినాలి" అందా స్త్రీ.

"ఈ సారి కూడా రెండు గంటలూ వింటామండి. కానీ ముచ్చలవానిపాలెం వెళ్ళాలి గదా" అన్నాడు శాస్త్రి.

"ముచ్చలవాని పాలెం కదూ అన్నావు. అక్కడ వెంకటేశ్వర్రావిల్లు నీకు తెలుసా?"

శాస్త్రి తెల్లబోతూ "ఆ యింటికే మేము వెడుతూంట" అన్నాడు.

"ఆ ఇంటికే అంటూ వేమిటి — ఆవిడక్కావలసిన వెంకటేశ్వర్రా వెవరో తెలుసుకోకుండానూ" అన్నాడు శర్మ స్నేహితుణ్ని మందలిస్తూ.

"ఆ వెంకటేశ్వర్రావు మహాపిసినిగొట్టులే. పేరు మోసిన వడ్డీ వ్యాపారి. వాళ్ళింట్లో ఓ కాపలావాడున్నాట్ట. వాడొక సారి యిక్కడకొచ్చి నన్ను కలుసుకుంటే బాగుండును. ఇంటికి కాపలాగా వుంటానంటే యిల్లే వాడికి వదిలేసి పోతాను" అందా స్త్రీ.

"మీ యింటికి కాపలా కావాలంటే ఆయనెవరో ఎందుకు? మేమే వుంటాం" అన్నాడు శర్మ వెంటనే ఆశగా.

"అద్దెక వచ్చిన వాళ్ళని కాపలాగా వుంచుతానేమిటి? అయినా అడ్డమైన వాళ్ళనూ నే నెందుకు నమ్ముతాను?" అందా స్త్రీ.

"మీ రెక్కడికి వెళ్ళాలి!" అన్నాడు శాస్త్రి.

"అదంతా నీ కనవసరం. నీకు వీలైతే ఆ కాపలా వాడికి చెప్పు..." అందా స్త్రీ. అప్పుడామె మాట

గసురుతున్నట్లుగా ఉంది.

ఇద్దరూ అక్కణ్ణించి చిన్న గదిలోకి వచ్చి తోళ్ళు వేసుకుని నడవలోకి వచ్చారు. వారి వెనుక నే చిన్న గది తలుపులు మూసుకున్నాయి.

5

మోటారు సైకిలు ముత్యాలవానిపాలెంలో ఓ యింటి ముందాగింది.

ఇంటిచుట్టూ నాలుగడుగుల ఎత్తుగోడ ఉంది.

ఓ చిన్న గేటు....

శాస్త్రి యింటి నంబరు మరోసారి శ్రద్ధగా చూశాడు. తృప్తిగా తలాడించాడు. ఈలోగా శర్మ మోటార్ సైకిల్‌ను స్టాండు వేశాడు.

శాస్త్రి గేటుతీసి లోపల ప్రవేశించాడు.

శర్మ లోపలకు ప్రవేశించి గేటు వేశాడు.

చుట్టూ మొక్కలున్నాయి. అవన్నీ కాయగూరలవే.

ఇద్దరూ సన్నని బాటలో ముందుకు వెళ్లారు.

సరాసరి కాలిదార్లోకి వెళ్లారు.

తిన్నగా ఓ గుమ్మం. ఎడమపక్కగా ఓ గుమ్మం.

తలుపులు దగ్గరగా వేసిఉన్నాయి.

ఇంటికి కాలింగ్ బెల్ ఉంది. శాస్త్రి బటన్ నొక్కాడు.

కొద్ది క్షణాల్లో తలుపులు తెరుచుకున్నాయి.

సుమారు ముప్పైఏళ్ళ యువకుడు. అతడి ముఖం చిరాగ్గా ఉంది.

“ఎవరుకావాలి?” అన్నాడతడు.

“శ్రీ వెంకటేశ్వరరావుగారు—” అన్నాడు శాస్త్రి.

“ఆయనతో మీకేం పని?”

"ఓ పట్టుచీర తాకట్టు పెట్టాం ఆయన దగ్గర. అదిప్పుడు విడిపించుకోవాలి...."

"ఎంత కాలమయింది?"

"చాలా ఏళ్ళయింది!" అన్నాడు శాస్త్రి.

"ఇప్పుడు వడ్డీ వ్యాపారం జరగడం లేదిక్కడ...." అన్నాడతడు.

"అదంతా నాకెందుకు? నా పట్టుచీర నాకు వాపసు కావాలి...."

అతడో క్షణం ఆలోచించి — "వెంకటేశ్వర రావుగారిప్పుడు బ్రతికి లేరు. ఆయన పిల్లలు వేర్వేరు ప్రాంతాల స్థిరపడ్డారు. నేను వారి దూరపు బంధువుని. ఈ యింట్లో అద్దెకుంటున్నాను. మీ పట్టుచీర వివరాలు తెలియాలంటే...." అని ఆగాడు.

"ఊఁ చెప్పండి—" అన్నాడు శాస్త్రి.

అతడు తటపటాయిస్తూ — "చెప్పాలంటే పట్టుచీర ఈ యింట్లో గదిలోనే ఉందని నేననుకుంటున్నాను...." అన్నాడు.

శాస్త్రికీ, శర్మకూ అతడు చెప్పేది అర్థం కావడానికి కాసేపు పట్టింది.

వెంకటేశ్వరరావు పద్ధతులు పిల్లలకు నచ్చలేదు. ఆయన సంపాదించినకొద్దీ యింకా సంపాదించాలనుకునే వాడు. సంపాదించిన డబ్బు అనుభవించాలన్న కోరిక ఆయన కుండేది కాదు. ఆయన భార్య కానీ, పిల్లలు కానీ ఆ డబ్బువల్ల సుఖాలు పొందలేదు సరికదా ఊళ్ళో వాళ్ళాయన్ను గురించనుకునే పరిహాస వాక్యాలు విని బాధ పడుతూండేవారు.

వెంకటేశ్వరరావు తను కూడబెట్టిన డబ్బుని

బంగారంగా, వజ్రాలుగా మార్చి ఇనప్పెట్టెలోకి తోసేస్తూండేవాడు. మొదట్లో ఊళ్ళో చాలా చిన్న యిల్లుండేది. అది సెంటర్లో యిల్లు. అదమ్మేసి ఆ డబ్బుతోనే అప్పట్లో చవగ్గా వస్తూంటే ముత్యాలవానిపాలెంలో యిల్లుకట్టి అక్కడకు మారాడు. కనీసం పెద్ద మేడైనా కట్టలేదని అంతా బాధపడేవారు.

అయితే ఆయన పిల్లలకు మంచి చదువులు చెప్పించాడు. ఉన్న ఒక్క కూతురికీ ఎన్నికైన సంబంధం చేశాడు. వాళ్ళెవరికీ ఆయన దారి నచ్చక రెక్కలు రాగానే ఎగిరిపోయారు. భార్య మాత్రం తప్పనిసరై ఆయనతో ఉండిపోయింది. ఆమె అదృష్టంకొద్దీ ఆయన పోయాడు.

పోయే ముందాయన "నేను నా పిల్లలకు చేసిన లోటేమీ లేదు. వాళ్ళను పైకి తెచ్చాను. నా సంపాదన మీద ఆశకొద్దీ వాళ్ళు నాకు దూరమయ్యారు. బ్రతికుండగా నేను వాళ్ళ కక్కల్లేకపోయాను. చచ్చేక నా సంపాదన అనుభవించాలని వాళ్ళకుండవచ్చు. అది సాగనివ్వను. నా ఇనప్పెట్టె ఎప్పటికీ యీ యింట్లోనే ఉంటుంది. దానికి గట్టి కాపలాకూడా ఏర్పాటు చేస్తాను...." అని భార్యకు చెప్పాడు.

ఆయన పోయాక ఓ ముసలివాడు ఇనప్పెట్టెకి కాపలాగా ఉంటున్నాడు. వాడెంత గట్టివాడంటే వారంతా ఊరొదిలిపెట్టి పోయినా ఇనప్పెట్టె గదికి ఏ భద్రతా అవసరం లేదు.

"మీ పట్టుచీర ఆ ఇనప్పెట్టెలోనే ఉంటుంది. కాపలా వాడికి నచ్చచెప్పి ఇనప్పెట్టెలోంచి ఆ పట్టుచీర తీసుకోండి___". అన్నాడా ఇంటి యువకుడు.

"పట్టుచీర ఇనప్పెట్టెలో ఉంటుందా?" అన్నాడు శాస్త్రి ఆశ్చర్యంగా.

"తాకట్టు వస్తువులందులోనే ఉంటాయి మరి...."

"తాళాలు....?"

"అవి ఇనప్పెట్టికే ఉంటాయి...."

"అదేమిటి? అవి వెంకటేశ్వర్రావుగారి భార్య దగ్గరుంటాయనుకుంటాను."

"ఆమె కొడుకుల దగ్గరుంటోంది...."

శాస్త్రి, శర్మ జరిగిందానికీ, విన్నదానికీ చాలా ఆశ్చర్యపడుతూ లోపలకు వెళ్ళి ఆ యువకుడు చూపిన గది వైపుకి వెళ్ళారు.

"జోళ్ళు విప్పుకుని లోపలకు వెళ్ళండి. ఇనప్పెట్టె గది ఆయనకు దేవాలయంకంటే ఎక్కువ—" అన్నాడా ఇంటి యువకుడు.

ఇద్దరూ జోళ్లు విడిచి లోపలకు వెళ్లారు.

గది విశాలంగానే ఉంది. అక్కడ వారికెవ్వరూ కనపడలేదు.

ఓ మూలగా నిలువెత్తు ఇనప్పెట్టె ఉంది. తాళాలు దానికి వేలాడుతున్నాయి.

శాస్త్రి ఇనప్పెట్టె సమీపించి తాళం తిప్పబోయాడు.

శర్మ గదిలో చుట్టూ చూస్తున్నాడు.

అప్పుడతడికి ఓ మూల కనిపించాడు....సుమారు అరవై యేళ్ళ వృద్ధుడు. నెరసినజుట్టు. కానీ బట్టతల కాదు. అయిదడుగుల పదంగుళాల పొడవుంటాడు. మనిషి కండలు తిరిగిలేడు కానీ దృఢంగా ఉన్నాడు.

"ఏయ్—" అన్నాడా వృద్ధుడు.

అతడెక్కణ్ణించి వచ్చాడా అని శర్మ ఆశ్చర్యపడు

తున్నాడు.

శాస్త్రి ఆగిపోయాడు తాళాలు తీయకుండా.

వృద్ధుడు వారిద్దర్నీ సమీపించి— "ఎవరు మీరు?" అనడిగాడు.

శర్మ తడబడ్డాడు. శాస్త్రిమాత్రం వెంటనే— "నీ కోసమే వచ్చాం...." అన్నాడు.

"నా కోసం వచ్చినవాళ్ళు—ఇనప్పెట్టె తాళాల జోలికెందుకు వెళ్ళారు?" కొట్టొచ్చినట్లు అడిగాడు వృద్ధుడు.

"గదిలో ఎవ్వరూ కనపడలేదు. ఇనప్పెట్టె తాళాల మీద చేయివేస్తే ఎవరైనా రాకపోతారా అనుకున్నాను. నువ్వు వచ్చావు...."

వృద్ధుడు నవ్వుతూ—"అంతా అబద్ధం. నన్ను చూసి భయపడి మాట మారుస్తున్నావు...." అన్నాడు.

"నీ వయసులో కూడా నిన్నెదిరించగల శక్తి మాకుంది. ఈ వయసులో నువ్వంటే మాకెందుకు భయం?" అన్నాడు శాస్త్రి.

"బహుశా నా శక్తి తెలిసి ఉండదు...."

"ఏమిటి నీ శక్తి?"

"ఇనప్పెట్టె తాళాలమీద మరోసారి చేయవేసి చూడు. అప్పుడు నీకు నా శక్తి తెలుస్తుంది...."

ఏం జరుగుతుందో చూడాలని శాస్త్రి ఇనప్పెట్టె తాళాలమీద చేయివేశాడు. వృద్ధుడు మెరుపు వేగంతో అతణ్ని సమీపించి గట్టిగా లాగాడు. ఆ విసురుకు శాస్త్రి అక్కణ్నించి మరో మూలకు వెళ్ళి పడ్డాడు.

శాస్త్రి పాటు చూసి శర్మ తనూ రియాక్టవ్వాడు కానీ వృద్ధుడు వెంటనే అతణ్ణీ మరో మూలకు విసిరేశాడు.

ఇద్దరికీ మామూలు మనిషి కావడానికి చాలాసేపు పట్టింది.

వృద్ధుడు నవ్వుతూ వారినే చూస్తున్నాడు.

"మాకు చాలా విద్యలు తెలుసు. కానీ నీ ముందు చాలలేదు. నీకు శిష్యరికం చేస్తాం. ఈ విద్య నేర్పుతావా?" అన్నాడు శర్మ.

"ఇది ఒకరు నేర్పితే వచ్చేది కాదు. దృష్టిపట్ల శ్రద్ధ ఉండాలి. అదే నీకు కొత్త విద్యలు నేర్పుతుంది—" అన్నాడు వృద్ధుడు.

"కానీ...." అని ఆగాడు శర్మ.

"ఏం—మరో ప్రయత్నం చేస్తారా?" అన్నాడు వృద్ధుడు.

"వద్దు—" అన్నాడు శాస్త్రి.

ప్రతిద్వంద్విని బలంతో జయించలేమని అతడికి తెలిసిపోయింది.

"ఇప్పుడు చెప్పు. ఇక్కడికెందుకు వచ్చావు?" అన్నాడు వృద్ధుడు.

"పట్టుచీర కోసం...." అన్నాడు శాస్త్రి.

"పట్టుచీర అంటే సోమయాజులు భార్యదా?" అన్నాడా వృద్ధుడు వెంటనే.

"అంత వెంటనే ఎలా చెప్పగలిగావు?" అన్నాడు శాస్త్రి ఆశ్చర్యంగా.

"ఇనప్పెట్టిలో ఉన్న పట్టుచీర అదొక్కటే!" అంటూ వృద్ధుడు తనే వెళ్ళి తాళంతీసి తలుపు తెరిచాడు.

ఇద్దరికీ కళ్ళు జిగేల్మన్నాయి.

పెట్టిలో ప్రతి అరలోనూ నోట్లకట్టలు, బంగారు

నగలు, కళ్ళు జిగేల్మనే వజ్రాలు....

బహుశా ఆ ఇనప్పెట్టెతో ఓ నగరాన్ని కొనిపారేయవచ్చునేమో!

మిత్రులిద్దరూ తెల్లబోయి చూస్తూండగా వృద్ధుడు ఇనప్పెట్టెలోంచి ఓ పట్టుచీర తీసి— "ఇదే కదూ!" అన్నాడు.

అవునో కాదో తెలియకపోయినా — "ఊఁ" అన్నాడు శాస్త్రి.

వృద్ధుడు పట్టుచీర మడతలోంచి ఒక కాగితం తీసి దానికేసి శ్రద్ధగా చూసి — "ఇది వెనక్కి పట్టుకుని వెళ్ళాలంటే పదహారువేల నాలుగు వందల ఇరవై ఒక్క రూపాయి డెబ్బైనాలుగు పైసలివ్వాలి. అంత డబ్బు తెచ్చారా?" అన్నాడు.

"పట్టుచీరకు అంత డబ్బా!"

"లేకుంటే నా దగ్గరే ఉంటుంది. అప్పు తీసుకున్నాక సోమయాజులు పైస కూడా తీర్చలేదని ఈ కాగితంలో ఉంది. వడ్డీ పెరక్కమవుతుంది!"

"నీ దగ్గర డబ్బు దాచుకుంటాను. ఇదేవడ్డీ ఇస్తావా?" అన్నాడు శర్మ వెంటనే.

"నేను వడ్డీవ్యాపారం చేయడంలేదు. ఉన్నదానికి కాపలా—అంతే!" అన్నాడు వృద్ధుడు.

"నువ్వు చాలా గొప్ప కాపలావాడివి. అందుకే కాబోలు ఆమె నిన్ను రమ్మంది...." అన్నాడు శాస్త్రి.

"ఆమె ఎవరు?" అన్నాడు వృద్ధుడు.

"పేరు మాకూ తెలియదు. చెంగల్రావు పేటలో ఉంటోంది..."

"ఆమెకు నాతో పనేమిటి?"

"తనింటికి కాపలా కాయాలట?"

"కాపలా కాస్తే ఏమిస్తుందిట!"

"తన యిల్లే వదిలి వెడుతుందిట...."

వృద్ధుడి కళ్ళు చిత్రంగా మెరిశాయి— "వదలాలనుకుంటున్న ఇంటికి కాపలా ఎందుకు?"

"అదే మాకూ అర్థంకాలేదు...."

"మీరు నిజమే చెబుతున్నారా?" అన్నాడు వృద్ధుడు.

"నీకు అబద్ధమెందుకు చెప్పాలి!"

"ఎందుకంటే—నన్నిక్కణ్ణించి తరిమెయ్యడానికి!" అని నవ్వాడు వృద్ధుడు— "కానీ ఇనప్పెట్టిని నేను లేకున్నా మీరు తెరువలేరు, అది తెలుసుకోండి...."

"బలంలో చాకచక్యంలో మేము నీకు సాటిరాక పోవచ్చు. కానీ మా శక్తియుక్తులను నువ్వు తక్కువ అంచనా వేయకద్దు...." అన్నాడు శాస్త్రి.

"అదీ చూద్దాం—తర్వాతెప్పుడైనా...." అని— "చెంగల్రావు పేటలో ఇల్లంటే అది నా అదృష్టమే! కానీ మీ మాటలే నాకు నమ్మతగ్గవిగా లేవు...." అన్నాడు వృద్ధుడు.

"ఒక్కసారి వెళ్ళిరావచ్చుగా—" అన్నాడు శాస్త్రి.

"మరోసారి ఆమెను కనుక్కునిరండి. తన ఇంటిని కాపలావాడి కెందుకివ్వాలనుకుంటోందో...."

"అదీ నువ్వే కనుక్కోవచ్చుగదా!"

"ఆ అవసరం నాకు లేదు...."

"నువ్వీ గదిని వదిలి వెళ్ళడానికి భయపడుతున్నావు." అన్నాడు శర్మ చిరాగ్గా.

"భయం నా కెందుకు?" అంటూ వృద్ధుడు పట్టు చీరను ఇనప్పెట్టెలో పెట్టి తలుపు తాళం వేసి తాళాల గుత్తి కేసి శర్మమీదకు విసిరి-"ఇనప్పెట్టె తెరు చూద్దాం-" అన్నాడు.

అది సవాలుగా తోచింది శాస్త్రికీ, శర్మకూ.

ఇద్దరూ ఆ తాళాలతో చాలా సేపు ప్రయత్నించారు. ఎంత ప్రయత్నించినా ఇనప్పెట్టె తలుపులు తెరుచుకో లేదు.

"నువ్వెలా తెరిచావు?" అన్నాడు శాస్త్రి ఆశ్చర్యంగా.

"అది నేను చెప్పను. ఎవ్వరూ తెలుసుకోలేరు...." అంటూ నవ్వి—"నేను నిజమే చెప్పానని తెలిసింది కదా! వెళ్ళి మరోసారి చెంగల్రావు పేట మనిషిని విషయమడిగి రండి. నేను వెళ్ళి ఆమెను కలుసుకుంటాను.." అన్నాడు వృద్ధుడు.

"ఆమెను మళ్ళీ కలుసుకోవడమా?" అని శాస్త్రి కంగారుపడ్డాడు.

"పద—పోదాం—" అన్నాడు శర్మ.

మిత్రులిద్దరూ అక్కణ్ణించి బయటపడ్డారు.

వాళ్ళు జోళ్ళు వేసుకుంటూంటే—"అరే! అప్పుడే వెళ్ళిపోతున్నారే—" అంటూ ఆ యింటి యువకుడు వారిని పలకరించాడు.

"వెళ్ళిపోతున్నాంగానీ—మళ్ళీ వస్తాం!" అన్నాడు శర్మ.

"మళ్ళీ వస్తారా?" అన్నాడా యింటి యువకు డాశ్చర్యంగా.

6

"అమలనూ, విమలనూ వాళ్ళ కర్మానికి వదిలిపెట్టడం మంచిదనిపిస్తోంది. మరోసారి చెంగల్రావు పేట వెళ్ళా మంటే ఆ యింటావిడ వేదాంతం పేరు చెప్పి మన ప్రాణాలు తీస్తుంది...." అన్నాడు శర్మ.

"నువ్వు చెప్పింది నిజమే-కానీ నేనలా ఊరుకోలేను. మన తెలివి తేటలన్నీ ఓ నడివయసు స్త్రీ ముందు వృధా అయితే—మన బలపరాక్రమం అరవై యేళ్ళ వృద్ధుడికి సాటి రాకపోతే మనం బ్రతికీ ప్రయోజనంలేదు. పట్టు చీర, ఆ యింట్లో కాపురం సాధించితీరాలి. ఇది మన శక్తిసామర్థ్యానికే సవాలు ..." అన్నాడు శాస్త్రి.

శర్మ ఆశ్చర్యంగా శాస్త్రి వంక చూసి—"అంటే అమల నన్నాకరించినకంటే ఎక్కువగా విమల నిన్నాకరించిందన్నమాట—" అన్నాడు.

"అలా ఎందుకనుకుంటున్నావు?"

"మనిషి అవకాశవాది. ఆదర్శంకోసం జీవితమంటాడు. జీవితంకోసం ఆదర్శాలు సృష్టించుకుంటాడు. నువ్వు విమలను ప్రేమిస్తున్నావు. ఆమెకు ప్రేమ కానుక ఇవ్వా లనుకుంటున్నావు .... అందుకని మనశక్తిసామర్థ్యాలకు సవాలంటున్నావు—" అన్నాడు శర్మ.

"కానీ—అలాగే అనుకో—నీ సంగతేమిటి?"

"నీకు సహకరించడం నా బాధ్యత అనుకుంటాను.."

"అంటే నువ్వూ అమలను నేను విమలను ప్రేమించి నంతగా ప్రేమిస్తున్నావన్నమాట .... దానికి సహకారమని పేరు పెడుతున్నావు...."

ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

శాస్త్రికి శర్మ కళ్ళలో అమల కనబడింది. శర్మకు

శాస్త్రి కళ్ళలో విమల కనబడింది.

"మనం నిజంగా నీ ప్రేమలో పడ్డాం—" అన్నారిద్దరూ ఒకేసారి.

"అయితే ఇప్పుడేం చేయాలి?" అన్న సందేహం కూడా వారిరువురికీ ఒకేసారి కలిగింది.

వృద్ధుడు మహా బలవంతుడు.

నడివయసు స్త్రీ మహాబోరు.

ఇద్దర్నీ ఎలా జయించాలి?

"మనవు ఓర్పు కావాలి. వాళ్ళిద్దర్నీ జాగ్రత్తగా పరిశీలించి ఇద్దరి బలహీనతలూ తెలుసుకుని సరైన దెబ్బ తీయాలి...." అన్నాడు శర్మ.

"కానీ చెంగల్రావు పేటావిడ వేదాంతం వింటూంటే బుద్ధి పనిచేస్తుందా?" అన్నాడు శాస్త్రి.

"కాలమే నీ ప్రశ్నకు సమాధానం చెబుతుంది—" అన్నాడు శర్మ.

7

మళ్ళీ మిత్రులిద్దరూ చెంగల్రావు పేటలో ఆ ఇంటికి వెళ్ళారు.

ఆమె వారి మాటలు వినిపించుకోకుండా వారికి వేదాంతబోధ చేసింది.

రెండుగంటలపాటు వారామెను సహించారు.

ఆమె అందుకెంతో సంతోషించి—"మీరు నాకు నచ్చారు. ఎందుకంటే నా వేదాంతం విని మళ్ళీ నా యింటికి వచ్చారు—" అంది.

"అసలెప్పుడూ మీ యింట్లోనే ఉండిపోదామనుకుంటున్నాం మేము—" అన్నాడు శర్మ.

"నాకు కొత్త మనుషులు కావాలి. ఎప్పుడూ మీకే

చెప్పాలంటే విసుగ్గా వుంటుంది—" అందామె.

"వేదాంత బోధను కొత్తమనుషులెందుకు?" అన్నాడు శాస్త్రి.

"నాకు తెలిసింది చాలా తక్కువ. మీకు రెండ్రోజుల్లో నాకు తెలిసినదాంట్లో నాలుగింట మూడొంతులు చెప్పేశాను. ఇంకొక్కవంతు మిగిలింది. ఆ తర్వాతనుంచి నా పాఠం మళ్ళీ మొదటికి వస్తుంది—" అందామె.

"ఫరవాలేదు. ఎన్నిసార్లైనా మీ పాఠం మేము మళ్ళీ మళ్ళీ వినగలం—" అన్నాడు శర్మ వినయంగా.

"వినడానికి మీకు విసుగు లేకపోవచ్చు. కానీ చెప్ప డానికి నాకు విసుగే మరి!" అందామె.

శాస్త్రి, శర్మ ముఖ ముఖాలు చూసుకున్నారు.

"అవునూ — నిన్న మీతో కాపలావాడి సంగతి చెప్పాను. మాట్లాడరా?" అందామె మళ్ళీ.

"మాట్లాడేము. అతడు మీ మాటలు నమ్మడంలేదు. ఇల్లొదిలి పెట్టాలనుకునే వారికి కాపలావాడెందుకూ అంటు న్నాడు...." అన్నాడు శర్మ.

"జీవితంలో తన బాధ్యతనంత గొప్పగా నిర్వహించే వాళ్ళు అరుదు. నేనిల్లు వదిలిపెడితే అలాంటి వాడికే వదుల్తాను. అతడితో కాసేపు మాట్లాడాలని నా కోరిక. ఏవిధమైన సందేహాలు పెట్టుకోక అతణ్ని నా వద్దకు రమ్మని చెప్పండి.." అందామె.

"అలాగే—ఈ రోజుకు సెలవు.." అంటూ మిత్రులా యింట్లోంచి బైటపడ్డారు.

మోటర్ సైకిల్ శర్మ స్టార్టుచేశాడు. శాస్త్రి వెనక కూర్చున్నాడు.

దారిలో—"నీ శావిడ బలహీన శేమైనా తెలిసిందా?" అన్నాడు శర్మ.

"తెలిసింది. ఆమెకిలా వేదాంతం బోధించడం యిష్టంలేదు. ఈ యిల్లొదిలిపోవాలనుకుంటోంది. కానీ మనకు మాత్రం యిల్లదెకిచ్చేలాలేదు...."

"అంటే మనం ఆ ముసలి కాపలావాడినే కాకా పట్టాలి. పట్టుచీర, అద్దె యిల్లు—రెండూ అతడివల్లనే మనకు దొరకాలి.." అన్నాడు శర్మ.

"చూద్దాం. మన అదృష్టమెలాగుందో—" అన్నాడు శాస్త్రి.

ఇద్దరూ ముత్యాలవాని పాలెంలో ఆ ఇల్లు చేరుకున్నారు.

ఆ యింటి యువకుడు వాళ్ళిద్దర్నీ చూసి ఆశ్చర్యపడుతూ—"నిజంగా నే మళ్ళీ మీ యిద్దరూ వచ్చారు-" అన్నాడు.

"అందులో ఆశ్చర్యమేముంది?" అన్నాడు శాస్త్రి.

"గజదొంగలుకూడా ఆ గదిలోకి రెండోసారి వెళ్ళాలనుకోరు.."

"మేము గజదొంగలం కాదు. పెద్దమనుషులం..." అంటూ శాస్త్రి అతడి అనుమతికోసం ఎదురుచూడకుండా లోపలకు నడిచాడు. తర్వాత యిద్దరూ జోళ్ళు దిగ విడిచి ఇనప్పెట్టె ఉండే గదిలో ప్రవేశించారు.

"డబ్బు తెచ్చారా?" అన్న గంభీర స్వరం వారి చెవులకు వినపడింది.

ఇద్దరూ అటు చూశారు.

ఒక మూలనుంచీ వచ్చాడు వృద్ధుడు.

"ద్రవ్యేమిటి?" అన్నాడు శాస్త్రి.

"పట్టుచీర విడిపించుకుని వెళ్ళేరూ?"

"మా దగ్గరంత డబ్బులేదు. మేము నిన్ను చెంగల్రావు పేట పంపించడానికి వచ్చాం, నువ్వు తిరిగొచ్చేదాకా మేమిక్కడే నీ గదిలో కాపలాగా ఉంటాం—" అన్నాడు శర్మ.

వృద్ధుడు వారివంక అదోలా చూసి—"మీ మనసులో యేదో దురాలోచన వుంది....—" అన్నాడు.

"ఉంటేమాత్రం మావల్ల నేమవుతుంది? ఇనప్పెట్టె తెరవడంకూడా మాకు చేతకాదు-" అన్నాడు శాస్త్రి.

వృద్ధుడు నవ్వి—"ఆమాత్రం నిజం గ్రహించారు. తెలివైనవాళ్ళే! ఇక నా మాటకు బదులు చెప్పండి. ఏమంటుంది చెంగల్రావు పేటావిడ!" అన్నాడు.

శాస్త్రి, శర్మ విషయం వృద్ధుడికి చెప్పారు. ఇల్లతడికి నచ్చే తామిందులో అద్దెకుండి అతడికి సక్రమంగా అద్దె కూడా చెల్లించుకుంటామన్నారు.

వృద్ధుడొక్క నిమిషం ఆలోచించి—"సరే—నేను వెడతాను....అయితే నేను వచ్చేవరకూ మీరిక్కడే వుండండి. వెళ్ళడానికి ప్రయత్నించినా, వెధవ పనులు చేసినా తిరిగివచ్చి మీ అంతు చూస్తాను...." అన్నాడు.

శాస్త్రి, శర్మ బుద్ధిగా తలాడించారు.

వృద్ధుడు గదిలోంచి వెళ్ళిపోయాడు.

కాసేపు మిత్రులిద్దరూ గదిలో బుద్ధిగానే కూర్చున్నారు. కానీ ఉన్నట్టుండి శాస్త్రి లేచి నిలబడి—"మనం మరో ప్రయత్నం చేద్దాం—" అన్నాడు.

శర్మ భయంగా—"వద్దు—" అన్నాడు.

"ఇప్పుడు టైము పదిన్నర దాటింది. ఈ రాత్రి వృద్ధుడు బయల్దేరి వెళ్ళాడు. చెంగల్రావు పేటకతడు

కాలినడకన వెడితే గంటకు పైగా పడుతుంది. ఏ ఆటోలో నైనా వెడితే అది వేరే సంగతి. అయినా అతడు తిరిగి రావడానికి చాలాసేపు పడుతుంది. ఈలోగా మనం కనీసం పట్టుచీర సాధించవచ్చు..."

"నువ్వు పట్టుచీర సంపాదిస్తే నీ పని అవుతుంది. మరి నావల్ల నేమవుతుంది?" అన్నాడు శర్మ.

"నువ్వు అమలను పెళ్ళిచేసుకున్నాకే — నేను విమలను పెళ్ళిచేసుకుంటాను. సరా?" అన్నాడు శాస్త్రి.

"తాళంమీద చేయివేయగానే ఆ కాపలావాడు కన బడితే!"

"వాడు బైటకు పోయాడుగా...."

"ఏమో — పోయాడో లేదో — ఎలా తెలుస్తుంది? నిన్న వాడు ముందు మనకు కనబడలేదు. తర్వాత ప్రత్యక్షమయ్యాడు."

శాస్త్రి సాలోచనగా — "వాడి సంగతి నాకు తెలిసింది. వాడు మనిద్దర్నీ హిప్నొటైజ్ చేస్తున్నాడు. వాడు ప్రత్యక్షం కావడం, మనల్ని వినిరేయడం, వాడికి పనిచేసిన తాళాలు మనకు పనిచేయకపోవడం — అంతా హిప్నాటిక్ ఎఫెక్ట్స్...." అన్నాడు.

"అదంతా ఎందుకంటావు?"

"ఆలోచిస్తుంటే ఇదంతా పెద్ద గూడుపుఠాణీ అని పిస్తోంది. అమల, విమలలకు కూడా ఇందులో పాత్ర ఉందేమో! చెంగల్రావు పేటలోని ఆడమనిషి, ముక్కాల వాని పాలెంలోని ఈ వృద్ధుడిని కలుసుకుని మాట్లాడు కోవాలనుకోవడంలో ఒక రహస్యముంది. అందుకు మననుపయోగించుకున్నారు.."

"ఎలా?" అన్నాడు శర్మ.

"వృద్ధుడు నిన్న మనని భ్రమలో వుంచాడు. ఈ గదిలో మనం శక్తిహీనులమన్న నమ్మకం కలగజేశాడు. ఆ ధైర్యంలో వాడు మననిక్కడ వదిలి వెళ్ళాడు. చూద్దాం ఈరోజేమవుతుందో...వాడిక్కడలేడు కాబట్టి మరోసారి మన ప్రయత్నాలు చేద్దాం.." అన్నాడు శాస్త్రి.

అంటూనే అతడు వెళ్ళి ఇనప్పెట్టె తాళాలు తెరవబోయాడు వెంటనే తెలుపు తెరుచుకుంది.

ఇద్దరికీ కలిగిన ఆశ్చర్యమింతా అంతా కాదు.

ఇనప్పెట్టెనిండా డబ్బు, నగలు, వజ్రాలు...

ఓ మూలగా పట్టుచీర...

శాస్త్రి పట్టుచీర తీసుకున్నాడు.

"ఇప్పుడేం చేద్దాం?" అన్నాడు శాస్త్రి.

శాస్త్రి పట్టుచీర మడతల్లోంచీ ఓ కాగితం తీశాడు.

సోమయాజులు పట్టుచీరను తాకట్టుపెట్టి తీసుకున్న అప్పు మొత్తం అయిదువందల రూపాయలు. చీరనిండా వెండి, బంగారు జరీ వుంది.

అప్పుడు శాస్త్రి తన జేబులోనుంచీ ఆరువందలు తీశాడు.

"అసలు అయిదువందలు, అందుకు కానిచ్చికోగల వడ్డీ వంద. మొత్తం ఆరువందలు—ఇనప్పెట్టెలో పెడుతున్నాను. ఈ వ్యవహారం నీకు నచ్చనిపక్షంలో నా పెళ్ళయ్యాక చీర వాపసు చేస్తాను. నా అడ్రసు...." అంటూ ఆ కాగితంమీద వ్రాశాడు.

"ఈ కాగిత మీ యింటి యువకుడికిద్దాం—" అన్నాడు శాస్త్రి.

శర్మ ఆ కాగిత మందుకుని చదువుతూంటే శర్మ ఇనప్పెట్టెకు తాళం వేశాడు.

ఇద్దరూ గదిలోంచి బయటపడి ఆ యింటి యువకుణ్ణి కలుసుకున్నారు. అతడు వరండా దగ్గర పట్టుచీర చూసి ఆశ్చర్యపడ్డాడు. అది పట్టించుకోకుండా శాస్త్రి, శర్మ యింట్లోంచి బైటపడ్డారు.

"తిన్నగా విమల దగ్గరకు వెడదాం—" అన్నాడు శాస్త్రి.

"ఇద్దరం ప్రేమకానుకలు సాధించినప్పుడే నువ్వు విమలను కలుసుకున్నా, నేను అమలను కలుసుకున్నా...." అన్నాడు శర్మ.

అప్పుడు శాస్త్రి చటుక్కున—"అయితే మనమిప్పుడు చెంగల్రావు పేట వెడదాం. అక్కడేం జరిగిందో తెలుసుకుందాం—" అన్నాడు.

"అక్కడింకా వృద్ధుడుండి—మన దగ్గర్నుంచీ పట్టుచీర లాక్కుంటే యేం చేస్తావు?" అన్నాడు శర్మ.

"భయం యిప్పట్నుంచీ వద్దు. పెళ్ళయ్యాక ఎలాగూ తప్పదు. ఆ వృద్ధుడికూడా జరిగింది చెబుతాం. వారం రోజుల భాగ్యానికి పట్టుచీరకు ఆరువందల రూపాయల అద్దె యువరిస్తారు....—అతడొప్పుకుంటాడని నా మనసు చెబుతోంది. పద...." అన్నాడు శాస్త్రి.

మోటార్ సైకిల్ చెంగల్రావు పేటవైపు దూకింది.

వారు చెంగల్రావు పేటలోని ఆ యింటిని చేరుకునే సరికి వృద్ధుడు—ఆమె చెబుతున్న వేదాంత పాఠం వింటున్నాడు.

ఇల్లు, ఇల్లాలు మిథ్య అంటోం దామె. మనిషి మాయా మోహాం నుంచి బయట పడాలంటోం దామె.

ఆ పాఠానికి శాస్త్రి, శర్మ భంగం కలిగించారు.

వృద్ధుడు శాస్త్రి చేతిలోని పట్టుచీర చూశాడు,

శాస్త్రి అతడికి తను చేసినపని చెప్పాడు.

"మీరు పట్టుచీర ఒక్కటే తీశారా? లేక...." అన్నాడు వృద్ధుడు.

"కావాలంటే మేమూ నీతో వస్తాం. నువ్వు మమ్మల్ని పరీక్షించుకోవచ్చు—" అన్నాడు శాస్త్రి.

"ఇనప్పెట్టెలో అంత డబ్బు, అన్ని నగలు, విలువైన వస్త్రాలు—ఉండగా పట్టుచీర ఒక్కటే ఎందుకు తీశారు మీరు?" అన్నాడు వృద్ధుడు.

శాస్త్రి తన కథ చెప్పాడు.

వృద్ధు డాశ్చర్యంగా—"అవకాశం చేజిక్కినపుడు మీకంతా డబ్బెందుకు తీసుకోలేదు?" అన్నాడు.

"అవకాశాన్నిబట్టి డబ్బు తీసేవాడు దొంగ. అవసరానికి దొంగతనం చేసేవాడు మనిషి....నాది అవసరం. అవకాశంతో నాకు నిమిత్తం లేదు...."

ఆమె వృద్ధుడివంక చూసి నవ్వుతూ—"చూశావా—నేను చెప్పింది నిజం—" అంది.

"ఏమిటి మీరు చెప్పినది—....?" అన్నాడు శాస్త్రి.

"ఈ తనువు శాశ్వతం కాదు. ఈ ఆస్తి శాశ్వతం కాదు. అసలీ భూమి కూడా శాశ్వతం కాదు. అలాంటప్పుడు జీవమున్నంత కాలం మనిషి తన దేహాన్ని అరిషడ్వర్గాలకు బానిసగా ఉంచడంలోవల్ల—బ్రతుకులోని మాధుర్యాన్ని కోల్పోతున్నాడు. లోభాన్ని వీడి, వ్యామోహాన్ని వదలిపెట్టి విశాల దృక్పథాన్నలవర్చుకుంటే మనిషీ భగవంతుడౌతాడు. నాకు మీలో ఉత్తమ మానవుడు కనిపించాడు. అదే ఈ వృద్ధుడికి చెప్పాను. బుజువు కావాలన్నాడు. బుజా

వయింది——...."

"అమ్మా! నీవు వయసులో నాకన్న చిన్న. కానీ జ్ఞానంలో నేను పసివాణ్ణి నా కళ్ళు తెరుచుకున్నాయి...." అన్నాడు వృద్ధుడు.

ఆ స్త్రీ శాస్త్రి, శర్మలవంక గంభీరంగా చూసి——"ఆ పట్టుచీర ఇక్కడ పెట్టి వెళ్ళండి. రేపుదయం రండి. చీరా మీకు దక్కుతుంది. ఇల్లూ మీదవుతుంది——" అంది.

8

మర్నాడుదయం ఏడు గంటలకు శాస్త్రి. శర్మ——చెంగల్రావు పేటలోని ఆ యింటికి వెళ్ళారు. ఇంటిముందు టులెట్ అన్న బోర్డుంది. వివరాలకు పక్కింట్లో సంప్రదించమని వ్రాసి వుంది.

ఇద్దరూ ఆశ్చర్యపడి పక్కింటికి వెళ్ళారు. పక్కింటాయన అది విని ఆశ్చర్యపడి తనూ వచ్చి టులెట్ బోర్డు చూసి——"ఇది నేను పెట్టినదే——కానీ చాలా కాలంగా గల్లంతయింది...." అన్నాడు.

అప్పుడు శాస్త్రి తామూ యింట్లోకి వెళ్ళిన విషయం చెప్పి ——"ఆ స్త్రీ యేమయిందంటారు? .... ——" అన్నాడు.

పక్కింటాయన బెదురుగా——"ఆమె ఎవ్వరో నాకు తెలియదు. కానీ-ఇంటికి వచ్చినవాళ్ళని వేదాంత పాఠాలతో బెదరగొట్టేస్తుంది. ఆమె కారణంగా నే నీ ఇంటి వెవరికీ అద్దెకివ్వలేకపోతున్నాను. నేనూ ఉండలేకపోతున్నాను ...." అన్నాడు.

"కానీ ఆమె ఈ రోజునుంచీ ఈ యింట్లో మే ముద్దుండవచ్చునంది——" అన్నాడు శాస్త్రి.

“మీరుంటారా? అయితే తప్పకుండా ఉండొచ్చు. సాయంత్రానికి రండి. ఇల్లు శుభ్రం చేయించి ఉంచుతాను— ....” అన్నాడు పక్కింటాయన.

“చాలా థాంక్స్....మీరు చెప్పినట్లే చేస్తాం. కానీ ముందుగా యింట్లో ఓ పట్టుచీర వదిలివెళ్ళాం. తెచ్చుకోవచ్చా?” అన్నాడు శాస్త్రి.

“ఉంటే అది మీదే—పదండి చూద్దాం—”అన్నాడు ఇంటాయన కుతూహలంగా.

ఇద్దరు మిత్రులూ, ఇంటాయనా లోపలకు వెళ్ళారు.

ఇంటికి తాళం వేసి వుండడంవల్ల పక్కింటాయన తాళం తీయవలసి వచ్చింది. లోపల యెప్పుడూ వుండే బరకమూ వ్యాసపీఠమూ లేవు. అసలింట్లో నరసంచార మున్నట్లే లేదు. ఒక మూలగా పట్టుచీ మడతలు విడి కుప్పలా పడి వుంది. చూస్తే అది కట్టివిడిచిన చీరలాగుంది.

శాస్త్రి చీరను మడత పెట్టుకున్నాడు. పక్కింటాయన దగ్గర సెలవు తీసుకుని యిద్దరూ ముందు తమ గదికి వెళ్ళారు.

అప్పటికే యింటిముందో కారాగి వుంది.

గదిముందో యువకుడు నిలబడి వున్నాడు.

“నా పేరు శ్రీనివాసరావు. నేను వెంకటేశ్వర్రావు గారి అబ్బాయిని. మీరు మా యింటికి రావాలి. మా ఇనప్పెట్టె తెరిచిపెట్టాలి—” అన్నాడతడు.

శాస్త్రికీ శర్మకూ ముందేమీ అర్థంకాలేదు.

ఆ యువకుడు ముందు వారిని కారెక్కమన్నాడు. కార్లో వారికి తన కథ వినిపించాడు.

వెంకటేశ్వరరావు చనిపోయాక కూడా దెయ్యమై ఇనప్పెట్టెనే ఆవహించుకుని తిరుగుతున్నాడు. అందులో

డబ్బు నెవరూ ముట్టుకుందుకు లేదు. ఆయనే దెయ్యమయ్యాడం చేత బాగుండదని వాళ్ళాగదిలో ఓ కాపలావాడున్నాడని నలుగురికీ చెప్పుకుంటూ తా మా యింటిని వదిలి పెట్టారు.

నిన్నరాత్రి శ్రీనివాసరావుకు వెంకటేశ్వర్రావు కలలో కనబడి—తనకు జ్ఞానోదయమై సకల వ్యామోహాలూ నశించాయనీ—తానిక యిల్లొదిలి వెళుతున్నాననీ చెప్పాడట. ఇనప్పెట్టెలోని డబ్బు భార్య, బిడ్డలు కాక శాస్త్రి, శర్మ అనే మరో యిద్దరు కూడా సమంగా పంచుకోవాలని ఆయన చెప్పాడట. తాళం శాస్త్రి, శర్మల ద్వారా తప్ప మరెవరికీ తెరుచుకోదనీ, ఎంత ప్రయత్నించినా లాభం లేదని ఆయనన్నాడు. శాస్త్రి శర్మల అడ్రసు ముక్కాలవానిపాలెం యింట్లోని యజమానుడి దగ్గరుంది. శ్రీనివాసరావు జరిగిందంతా తెలుసుకుని శాస్త్రి, శర్మలకోసం వచ్చాడు.

ఈ కథను శాస్త్రి, శర్మలు ఆశ్చర్యంగా విన్నారు. వా రాశ్చర్యం నుంచి తేరుకు నేసరికి కారు ముక్కాలవాని పాలెం చేరుకుంది.

అప్పటికే యింట్లో చాలామంది చేరారు. వెంకటేశ్వర రావు భార్యాబిడ్డ లందరూ అక్కడే వున్నారు.

ఆ గదిలో....

ఇనప్పెట్టె తాళం తీయడం యెవరివల్లా జరగడం లేదు.

శాస్త్రి ముందుకు వెళ్ళి తాళం తిప్పాడు. టక్కున తలుపు తెరుచుకుంది.

న్యాయంగా పంచుకోగా మిత్రులిద్దరికీ కలిసిన ఆస్తి విలువ చెరొక అయిదులక్షలూ....

"దేవుడు మన నాశీర్వదించాడు. జీవితంలో స్థిరపడ మంటున్నాడు. లేకుంటే యిలాంటి విచిత్రం జరగదు...." అన్నాడు శర్మ.

"వెంకటేశ్వరరావును మార్చినది దేవుడా, చెంగల్రావు పేటావిడ వేదాంతమా, మన సత్ప్రవర్తనా అన్నది నాకు తెలియడంలేదు...." అన్నాడు శాస్త్రి.

"ఏమో—అంతా కలలా ఉంది. మనమిప్పుడు అర్జంటుగా అమలనూ, విమలనూ కలుసుకోవాలి—పద!" అన్నాడు శర్మ.

ఇద్దరూ సోమయాజు లింటికి వెళ్ళారు.

శాస్త్రి విమలకు పట్టుచీర యిచ్చాడు.

శర్మ అమలతో అద్దెయింటి గురించి చెప్పాడు.

ఆ సమయంలో సోమయాజులు భార్య పూజలో ఉంది. బావమరిది స్కూలుకు వెళ్ళాడు. సోమయాజులు ఆఫీసులో వున్నాడు.

"ఎలా సాధించారు?" అన్నా రమల, విమల ఏక కంఠంతో.

శాస్త్రి, శర్మ తమ విజయగాథ వివరించారు.

"అంటే మీ రిప్పుడు లక్షాధికారులు. అయినా యింకా మమ్మల్ని ప్రేమిస్తున్నారా?" అంది అమల ఆశ్చర్యంగా.

"మా లక్షలు మీ అదృష్టాన్ని పెంచడానికే—మా ప్రేమను త్రుంచడానికి కాదు—" అన్నాడు శర్మ.

"అసలు మీకు—విచిత్రమైన ప్రేమకానుకలు కోరాలని ఎందుకో కోరిక పుట్టింది?...." అన్నాడు శాస్త్రి ఆశ్చర్యంగా.

"మా అమ్మ చనిపోయే ముందా చీర కట్టుకుని ఆ యింట్లో మసలాలని ఎంతో మనసు పడింది. నాన్న ఆ కోరిక తీర్చలేదు. ఆ కోరిక తీరకుండానే అమ్మ పోయింది. ఆమెకు మేము ప్రతిరూపాలం కాబట్టి కాబోయే భర్తల ద్వారా ఆ కోరిక తీర్చుకోవాలనుకున్నాం. నిజంగా యిలా తీరుతుందనుకోలేదు. మీరు నిజంగా అసామాన్యులు. అసాధారణ పురుషులు. ఒక్కసారి పక్కగదిలోకి రండి. మా అమ్మ ఆశీర్వాదం పొందవచ్చు—" అంది అమల.

అంతా పక్కగదిలోకి వెళ్ళారు.

అక్కడ గోడకు వ్రేలాడుతోందొక పటం. పటానికి పూలమాల వుంది.

"తనకేమీ అపకారం చేయకద్దని పిన్ని రోజూ అమ్మ పటానికి మాలవేసి పూజ చేస్తూంటుంది. పిన్నికి బ్రతికున్నవాళ్ళంటే ప్రేమ లేకపోయినా చచ్చినవాళ్ళంటే భయ మిక్కుట—" అంది విమల.

శాస్త్రి శర్మ—యిద్దరూ ఆ ఫోటోవంకే ఆశ్చర్యంగా చూస్తున్నారు.

కట్టి విడిచిన చీర యిద్దరి కళ్ళ ముందూ మెదుల్తోంది.

అందరికీ వేదాంతబోధన చేయాలనుకుంటున్న చెంగల్రావు పేటావిడ—పట్టుచీరపై మమకారంతో దెయ్యమై ఆ యింట్లో తిరుగుతోంది. అంతవరకూ ఆ మిత్రుల బుర్రలో ఉన్న సందేహాలెన్నో పటాపంచలై పోయాయి. కానీ తాము నిజంగా రెండు దెయ్యాలతో వ్యవహరించామన్న స్పృహ వారి వళ్ళు జలదరించేలా చేస్తోంది.

శాస్త్రి విమల చేయి పట్టుకున్నాడు. శర్మ అమల

చేయి పట్టుకున్నాడు. రెండు జంటలూ వెనక్కి తిరిగాయి.

గుమ్మంలో అప్పుడే పూజ చేసుకుని వచ్చిన సోమయాజులు భార్య వుంది. ఆమె కళ్ళలో నిప్పులు కురుస్తున్నాయి.

శాస్త్రి భయపడలేదు, శర్మ భయపడలేదు. ఎప్పుడూ భయపడే అమల, విమల భయపడలేదు.

ఆ తర్వాత వచ్చిన పున్నమికి ఆ రెండు జంటలూ వెన్నెల్లో బీచివద్ద ఉన్నాయి.

—: అయిపోయింది :—